# మేం కొన్నవి పట్టా భూములే!

- భూదాన్ భూములు కాదు
- సింగిల్ జడ్జి ఆర్డర్‌ను సవాల్ చేస్తూ ఐపీఎస్‌ల అప్పీల్



హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో సర్వే నం.194లో తాము పట్టా భూములనే కొనుగోలు చేశామని పలువురు ఐపీఎస్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. తాము కొనుగోలు చేసినవి భూదాన్ భూములు కావని పేర్కొన్నారు. అవి భూదాన్ భూములేనంటూ దాఖలైన పిటిషన్‌పై సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ వారు అప్పీళ్లను దాఖలు చేశారు. తమ భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చాలన్న సింగిల్ జడ్జి ఆదేశాలను రద్దు చేయాలని వారు హైకోర్టును కోరారు. సర్వే నంబర్ 194లో 16, 20, 18 గుంటల చొప్పున కొనుగోలు చేశామని, దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాలు, విక్రయ పత్రాలు కూడా తమ వద్ద ఉన్నాయని తెలిపారు.

నాగారం గ్రామంలోని భూదాన్ భూముల్లో అక్రమాలపై సీబీఐ, ఈడీతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ మహేశ్వరం మండలానికి చెందిన బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రెండు రోజుల క్రితం విచారణ జరిపిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి నాగారం గ్రామంలో సర్వే నం 181, 182, 194, 195లో భూదాన్ భూములకు సంబంధించి జరిగిన అక్రమ విక్రయాల్లో పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారుల పాత్ర ఉన్నదని ప్రాథమిక నిర్ధారణకు వచ్చి ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఆదేశాలను రద్దు చేయాలంటూ ఐపీఎస్ అధికారులు రవి గుప్తా, తరుణ్‌జోషి, బీకే రాహుల్ హెగ్డే, జితేందర్‌కుమార్ గోయల్ భార్య రేణుగోయల్, ఐఏఎస్ అధికారి జనార్దన్‌రెడ్డి కొడుకు రాహుల్ బుసిరెడ్డి, ఐపీఎస్ అధికారులు మహేశ్ మురళీధర్ భగవత్, సౌమ్యా మిశ్రా, స్వాతిలక్రా, ఉమేశ్ షరాఫ్ భార్య రేఖ షరాఫ్, ప్రైవేటు వ్యక్తి వీరన్నగారి గౌతంరెడ్డి వేర్వేరుగా నాలుగు అప్పీళ్లను దాఖలు చేశారు. ఈ అప్పీల్ పిటిషన్లపై హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

# విద్యుత్తు సంస్థల్లో ప్రమోషన్లకు బ్రేక్

- రివ్యూ పిటిషన్లు తేలే వరకు స్టే
- ప్రమోషన్లల్లో ఓసీ, బీసీలకు అన్యాయమంటూ పిటిషన్లు
- గత ఉత్తర్వులపై రివ్యూ పిటిషన్ ఉందన్న విద్యుత్తు సంస్థలు



హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థల్లో పనిచేసే వారికి పదోన్నతులు కల్పించరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలకు మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేశారు. 2014 జూన్ 2 నుంచి ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులు కల్పించడం వల్ల నష్టపోయిన ఓసీ, బీసీ ఉద్యోగులకు కూడా సీనియార్టీ మేరకు పదోన్నతులు కల్పించాలని 2018లో వెలువడిన కోర్టు ఆదేశాలను రివ్యూ చేయాలన్న పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున పిటిషనర్లకు ఏవిధమైన ఉత్తర్వులు జారీ చేయవద్దంటూ విద్యుత్తు సంస్థలు చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. ఈ ఉత్తర్వులు వెలువడి ఏడేండ్లు అయ్యిందని, ఇప్పటివరకు అమలు కాలేదని, రివ్యూ పిటిషన్‌పై తుది ఉత్తర్వులు వెలువడే వరకు పదోన్నతులు కల్పించరాదని ఆదేశాలు జారీచేసింది. తెలంగాణ ఆవిర్భావం జరిగిన 2014 జూన్ 2 నుంచి ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులు కల్పించడం వల్ల నష్టపోయిన ఓసీ, బీసీ ఉద్యోగులకు కూడా సీనియార్టీ మేరకు పదోన్నతులు కల్పించాలని 2018లో హైకోర్టు ఆయా విద్యుత్తు సంస్థలకు ఉత్తర్వులు జారీచేసింది. అన్ని క్యాటగిరీల ఉద్యోగుల సీనియార్టీని సమీక్షించి బీసీ, ఓసీ ఉద్యోగులకు కూడా ఆయా నిష్పత్తి మేరకు పదోన్నతులు కల్పించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ తాజాగా పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గోడ శివ వాదనలు వినిపిస్తూ, సుప్రీంకోర్టు, హైకోర్టు గతంలో జారీచేసిన ఉత్తర్వుల మేరకు తెలంగాణలోని ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లోని ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని అన్నారు. తెలంగాణ ఏర్పాటు జరిగిన జూన్ 2, 2014 నుంచి ఇచ్చిన పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులతో సమానంగా సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించకపోవడం వల్ల బీసీ, ఓసీ ఉద్యోగులు నష్టపోతున్నారని చెప్పారు. దీనిపై విద్యుత్తు సంస్థల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. ఇప్పటికే రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున పిటిషనర్లకు అనుకూలంగా ఏ విధమైన ఉత్తర్వులనూ జారీ చేయవద్దని కోరారు. ఇరు పక్షాల వాదనల విన్న హైకోర్టు.. ఓసీ, బీసీలకు కూడా పదోన్నతులు కల్పించాలని ఉత్తర్వులు వెలువడి ఇప్పటికే ఏడు సంవత్సరాల కాలం అయిపోయిందని గుర్తుచేసింది. ధర్మాసనం 2018లో ఉత్తర్వులు ఇచ్చిందని, దీనిపై దాఖలైన రివ్యూ పిటిషన్ మీద కూడా విచారణ పూర్తిచేసి తుది ఉత్తర్వులను వెలువరించే వరకు అన్ని విద్యుత్తు సంస్థల్లోని సిబ్బందికి ఎలాంటి పదోన్నతులు ఇవ్వరాదని పేర్కొంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

### తీర్పును స్వాగతించిన ఉద్యోగుల జేఏసీ

విద్యుత్తు సంస్థల్లో ఉద్యోగుల పదోన్నతులను నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కోడేపాక కుమారస్వామి, వైస్ చైర్మన్ ఆర్ సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్న గౌడ్, కో కన్వీనర్ సీ భానుప్రకాశ్ తదితరులు స్వాగతించారు. యాజమాన్యాలు మొండి వైఖరి ప్రదర్శించకుండా, పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా తెలంగాణ, ఏపీ సచివాలయాల్లో సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని, విద్యుత్తు సంస్థల్లో అమలు చేయకపోవడం అన్యాయమని బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు వ్యాఖ్యానించాయి.

# 45 వింటేజ్‌కార్లు.. 23 లక్షల నగదు!

- భూదాన్ భూముల విక్రయాలతో అక్రమ సంపాదన
- ఈడీ తనిఖీల్లో బట్టబయలు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): భూదాన్ భూముల వ్యవహారంలో పాతబస్తీలోని పలువురి ఇండ్లలో తనిఖీలు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం పలు విషయాలను వెల్లడించింది. ఖదీర్‌ఉన్నీసా, మునావర్‌ఖాన్, లతీఫ్ షర్ఫాన్, అక్తర్ షర్ఫాన్, సుకూర్‌ల నివాసాల్లో సోదాలు జరిపి 45 వింటేజ్ కార్లు, రూ.23 లక్షల నగదు, 12,000 యూఏఈ దిర్హామ్‌లు, భూములకు సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపింది. ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వ అధికారులు కలిసి నకిలీ పత్రాలు తయారు చేసి ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించినట్టు ఈడీ గుర్తించింది. మాహేశ్వరం మండలం, నాగారం గ్రామంలోని భూదాన్ భూమిని ఖదీరున్నీసా తాను వారసత్వంగా పొందినట్టు నకిలీ పత్రాలు సృష్టించి, అధికారుల అండదండలతో రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి, మధ్యవర్తుల సహకారంతో ప్రైవేట్ వ్యక్తులకు అమ్మినట్టు ఈడీ దర్యాప్తులో తేలింది. ఈ మధ్యవర్తులు ప్రభుత్వ అధికారులతో చేతులు కలిపి నకిలీ పత్రాలతో ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి, అమాయకులకు విక్రయించారని ఈడీ తెలిపింది. ఈ కేసు ఇంకా దర్యాప్తులో ఉందని అధికారులు చెప్పారు.

# ఆ తల్లీ, బిడ్డలకు వైద్యం చేయించండి

## మహిళా, శిశు సంక్షేమ శాఖకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): అల్లుడు చేయిస్తున్న మానసిక వైద్యచికిత్స వల్ల తమ కుమార్తె (8 నెలల గర్భిణి) ప్రాణాలకు హాని జరిగే ప్రమాదం ఉన్నదంటూ గుంటూరుకు చెందిన శ్రీనివాసరావు దంపతులు దాఖలు చేసిన వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. వారి కుమార్తెకు, రెండేండ్ల వయసున్న ఆమె కుమారుడికి హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో వైద్యం జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆమె గర్భంలో ఉన్న పిండం ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం రక్తహీనత, నరాల సమస్యతో బాధపడుతున్న ఆ తల్లీ బిడ్డలను చూసేందుకు మాత్రమే అనుమతించాలని, ఇతరులెవరినీ అనుమతించరాదని తేల్చిచెప్పింది. ఈ మేరకు రాష్ట్ర మహిళా,శిశు సంక్షేమ శాఖకు ఉత్తర్వులు జారీ చేసిన జస్టిస్ టీ వినోద్ కుమార్.. బుధవారం తదుపరి విచారణ కొనసాగిస్తామని ప్రకటించారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.